క్లుప్తంగా

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలి

పుల్లలచెరువు: గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఈవోఆర్డీ శ్రీనివాసులు అన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ వర్షాలు తగ్గు ముఖం పడుతున్నందున మండలంలోని అన్ని గ్రామాల్లో కార్యదర్శులు పారిశుధ్య చర్యలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. సున్నం, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జనావాసాల మధ్య చెత్తకుప్పలను, మురుగు, వర్షపు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది కూడా గ్రామాల్లోని ప్రజలకు పారిశుధ్య చర్యలపై ప్రస్తుతం తరుణంలో ఆచరించవల్సిన పనులపై అవగాహన కల్పించేలా చూడాలన్నారు.

పౌర్ణమికి త్రిపురగిరి ప్రదక్షిణ


త్రిపురగిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

త్రిపురాంతకం: శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం వద్ద పౌర్ణమి సందర్భంగా భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. త్రిపురాంతకం శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమికి అభిషేకం, ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రత్యేక పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రతి పౌర్ణమికి జరుగుతున్న త్రిపురగిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని భక్తులు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనం చేసి ప్రసాదాలు అందజేశారు.

నేడు మండల పరిషత్ సమావేశం

యర్రగొండపాలెం: మండల ప్రజాపరిషత్ సమావేశం శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బండారు శ్రీనివాసరావు తెలిపారు. సమావేశానికి ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ అధ్యక్షత వహిస్తారని, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరై ప్రజల సమస్యలపై చర్చించాలని ఆయన కోరారు.

మోహన్‌రావు సేవలు మరువలేనివి


మోహన్‌రావును సన్మానిస్తున్న నాయకులు

పెద్దదోర్నాల: పెద్దదోర్నాల మేజర్ పంచాయతీ ప్రజలకు మెరుగైన సేవలు అందించి అందరి హృదయాల్లో కార్యదర్శి మోహన్‌రావు నిలిచిపోయారని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డి కొనియాడారు. పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న మోహన్‌రావు బదిలీపై రాయవరం వెళ్తున్న సందర్భంగా పలువురు నాయకులు, సిబ్బంది ఆయన్ను గురువారం ఘనంగా సత్కరించారు. గంటా రమణారెడ్డి మాట్లాడుతూ సర్పంచ్ చిత్తూరి హారిక, కార్యదర్శి మోహన్‌రావు పరస్పర అవగాహనతో పంచాయతీ ప్రజలకు మెరుగైన సేవలను అందించారన్నారు. విధులు నిర్వహించిన ప్రతిచోటా మంచి పేరు ప్రఖ్యాతలు గడించడంతో పాటు పంచాయతీ సేవలను విస్తృత పరిచారన్నారు. నాయకులు యక్కంటి మల్లారెడ్డి, యక్కంటి లింగారెడ్డి, చిట్యాల యోగిరెడ్డి, చెన్నారెడ్డి, బండారు సుబ్బనారాయణ, ప్రసాద్, కిరణ్, కిశోర్‌కుమార్ పాల్గొని మోహన్‌రావుకు ఘన వీడ్కోలు పలికారు.

పోలీసుస్టేషన్ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న సీఐ అస్సాన్

దొనకొండ: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను త్రిపురాంతకం సీఐ జి.అస్సాన్ గురువారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి, బెల్టు షాపుల వంటివి, ఆరుబయట మద్యం తాగడం, మద్యం తాగి వాహనాలు నడపటం నేరమని ప్రజలకు వివరించాలని చెప్పారు. గ్రామాల్లో పోలీస్ సిబ్బంది అప్పుడప్పుడూ గస్తీ నిర్వహించాలన్నారు. దొనకొండ కూడలి ప్రాంతాల్లో, పాఠశాలల వద్ద, వసతి గృహాల వద్ద రాత్రిపూట గస్తీ తిరగాలన్నారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తుంటే సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని, వాహన చోదకులకు లైసెన్స్, హెల్మెట్ తప్పని సరిగా ఉండాలని పోలీసులకు సీఐ సూచించారు. గ్రామాల్లో ఏవైనా సంఘటనలు జరిగితే వెంటనే స్పందించి సిబ్బంది గ్రామాలకు వెళ్లి ప్రజలతో మాట్లాడాలని సీఐ వివరించారు. ఎస్‌ఐ కె.విజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అందని ఎరువులు.. అన్నదాతకు తిప్పలు!

పుల్లలచెరువు:

అన్నదాతకు చేయూత ఇవ్వాలని ప్రభుత్వం మర్చిపోయినట్లు ఉంది. పంటల సాగు సమయానికి ఎరువులు అందకపోవడంతో సాగు భారంగా మారుతోంది. దీంతో పంటలను కాపాడుకునేందుకు ప్రైవేట్ దుకాణాల్లో ఎరువులు కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. రైతులకు ఎరువులు, పంటల బీమా, తదితర సేవలు అందించేందుకు గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం వాటిని రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. వీటి ద్వారా ఇంతవరకు ఎరువులను రైతులు కొన్నది లేదు. కేవలం చూపునకు మాత్రమే ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇవే కేంద్రాల ద్వారా ఎరువులను ఆర్డర్ పెడితే ఇంటికి వచ్చి ఇచ్చే వారని, ప్రస్తుతం అలా జరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగుకు ఇబ్బంది

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ప్రస్తుతం మిర్చి, పొగాకు, మినుము, వరి సాగు చేస్తున్నారు. పుల్లలచెరువు మండలంలో ఏడు వేల ఎకరాల్లో మిర్చి, నాలుగు వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. ఎరువులు అందుబాటులో లేకపోవడంతో సాగుకు ఇబ్బంది పడాల్సి వస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో అందుబాటు లేకపోవడం, సొసైటీ పరిధిలో ఎరువులు విక్రయాలు జరపకపోవడంతో రైతులు ప్రైవేట్ దుకాణాదారులను ఆశ్రయించడంతో డిమాండ్ ఆధారంగా అధిక ధరలకు అమ్ముతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా, డీఏపీలు డిమాండ్ ఆధారంగా దుకాణదారులు విక్రయిస్తున్నారని, వేసిన పంటలకు అనుగుణంగా దుకాణదారుల వద్ద నిల్వలు లేవని రైతులు వాపోతున్నారు. అధికారులు మండలంలో సాగు చేసిన పంటలకు అనుగుణంగా ఎరువులను సరఫరా చేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.


సాగులో ఉన్న మిర్చి పంట

ఎరువులు అందుబాటులో లేవు:

నేను మిర్చి పంటను సాగు చేశా. ప్రస్తుతం పంటకు డీఏపీ వాడాల్సి ఉన్నందున అధిక ధరలకు కొనుగోలు చేశా. స్థానిక రైతు సేవా కేంద్రాల్లో విక్రయాలు లేకపోవడంతో ప్రైవేట్ దుకాణదారులు చెప్పిన ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఎరువుల ధరలు పెరగడంతో పెట్టు బడులు కూడా పెరుగుతున్నాయి. అధికారులు స్పందించి రైతులకు ఎరువులను అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

నాసర్‌రెడ్డి, రైతు, ఉమ్మడివరం

రైతులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం:

పుల్లలచెరువు మండలంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటాం. రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులను ఆర్డర్ చేసుకోవచ్చు. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

నిర్మలాదేవి, వ్యవసాయాధికారి, పుల్లలచెరువు

ఉద్యాన పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి

కురిచేడు: ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు అధిక వర్షాలతో పంటలు దెబ్బతినకుండా జాగ్రత్తలు పాటించాలని ఉద్యానవన విస్తరణాధికారి ధనలక్ష్మి సూచించారు. మండలంలోని ఆవులమంద, కల్లూరు, పడమరనాయుడుపాలెం, గంగదొనకొండ, పెద్దవరం గ్రామాల పరిధిలోని ఉద్యాన పంటలను ఆమె గురువారం పరిశీలించారు. మిరప పంట సాగు చేస్తున్న రైతులు పంట పొలాల్లో ఉరకెత్తిన మొక్కలు వెంటనే కోలుకోవటానికి లీటర్ నీటికి 10 గ్రాముల యూరియా, మరియు 10 గ్రాముల పంచదార కలిపి ద్రావణాన్ని వారం రోజుల్లో 2 సార్లు పిచికారీ చేయాలన్నారు. మొక్కలు వడబడి తలలు వాల్చితే లీటర్ నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణం, ఇనుప ధాతు లోపంతో మొక్కలు మొక్కలు పాలిపోతే లీటరు నీటికి 50 గ్రాముల అన్నభేదితో పాటు ఒక నిమ్మచెక్క రసం కలిపి పిచికారీ చేయాలన్నారు. మొక్కలు తీరుకున్న తర్వాత స్థూల పోషకాల మిశ్రమాన్ని లీటరు నీటికి 5 గ్రాములు, మరియు సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 2.5 గ్రాములు కలిపి ఒకదాని తర్వాత ఒకటి వారం రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలన్నారు. వేరు కుళ్లు ఆశించిన పొలాల్లో కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు లేదా కార్బెండిజం 10 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపి ద్రావణాన్ని మొక్కలు మొదట్లో పోయాలన్నారు. పంటను ఆశించే వివిధ రకాల గొంగళి పురుగుల నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ లేదా అసెంఫేట్ 1.25 గ్రాములు లేదా నోవాల్యూరాన్ 0.75 మి.లీ వంటి కీటక నాశని మందులను పిచికారీ చేయాలని సూచించారు. బొప్పాయి పంట సాగు చేస్తున్న రైతులు కొత్తగా మొక్కలు నాటినప్పుడు అధిక వర్షాలతో నీరు నిలవకుండా మురుగునీటి వసతి కల్పించాలన్నారు. అధిక వర్షాలతో మొక్కలు పసుపు రంగులోకి మారడం, కాండం కుళ్లడం వంటి లక్షణాలు ఉంటే రెడోమిల్ 2 గ్రాములు లీటర్ నీటికి, ఎలైట్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్కలు మొదట్లో పోయాలన్నారు. కూరగాయలు సాగు చేసే రైతులు పడిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు దగ్గర మట్టిని ఎగదోయాలన్నారు. మొక్కకు సరిపోయిన అంత ఆకుకొమ్మలతో ఉంటే 13–0–45ను 3 శాతం నీటితో రెండు గ్రాముల యూరియా ద్రావణాన్ని 2–3 సార్లు వారం రోజులు పిచికారీ చేయాలని ఆమె తెలిపారు. వీఏఏలు మల్లికార్జున, అనిల్, రామాంజనేయులు పాల్గొన్నారు.


కురిచేడు: మిరప పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న హెచ్‌ఈఓ ధనలక్ష్మి

త్రిపురాంతకం: తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు మిర్చి, కంది, మొక్కజొన్న, పత్తి, వరి పంటలు దెబ్బతినే అవకాశం ఉన్నందున రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కె.నీరజ పేర్కొన్నారు. పంటలను పరిశీలించిన అధికారులు రైతులకు తగిన సూచనలు చేశారు. పంట పొలాల్లో నీరు నిలిస్తే వెంటనే నీటిని బయటకు పంపాలని సూచించారు. పైరు దెబ్బతింటే వెంటనే తగిన ఎరువులు, మందులను పిచికారీ చేయాలన్నారు. ప్రధానంగా శుడి దోమ, పొడ, అగ్గితెగులు, కాండం తొలిచే పురుగు వంటివి ఆశిస్తున్నందున రైతులు తగిన సూచనలు పాటించాలని నీరజ తెలిపారు. ఈమె వెంట వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.


త్రిపురాంతకం: వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

పెద్దారవీడు: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి తెలిపారు. మండల పరిధిలో తోకపల్లి, కంభంపాడు గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మేలైన యాజమాన్య పద్ధతుల్లో పంటలు సాగు చేయాలని తెలిపారు. ఒకే రకం పంటలు సాగు చేస్తే నేలలో భూసారం తగ్గి దిగుబడి అంతంత మాత్రంగానే ఉంటుందన్నారు. అధిక వర్షాలతో పంటలకు ఎటువంటి నష్టాలు జరుగుతాయని, వాటికి తీసుకోవాల్సిన నివారణ మార్గాల గురించి చెప్పారు. పత్తి, కంది పంటలకు వచ్చే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పత్తి పంట కాయదశలో ఉన్నప్పుడు కుళ్లు వచ్చే అవకాశం ఉన్నందున నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. వర్షాలకు పత్తిలో ఆకు మచ్చ తెగుళు రావడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందని నివారణకు గ్రాము హెక్సాకొనజోల్ లేదా కార్బన్డిజం మందు లీటరు నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి

రాయితీతో శనగ విత్తనాలు

25 శాతం రాయితీతో శనగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. శనగ క్వింటా పూర్తి ధర రూ.9400 ఉండగా 25 శాతం సబ్సిడీ రూ 2350 పోను మిగిలిన రూ. 7050 చెల్లించి రైతు విత్తానాలు పొందాలన్నారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఫోను రైతు సేవా కేంద్రాలకు తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి సౌజన్య, వీఏఏలు ప్రేమ్‌కుమార్, వస్తంనాయక్, జిలానీ, రైతులు పాల్గొన్నారు.

వర్షం కురిస్తే ప్రభుత్వ వైద్యశాల బురదమయం


యర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాల ఎదుట ఇలా..

యర్రగొండపాలెం: వర్షం కురిస్తే స్థానిక ప్రభుత్వ వైద్యశాల బురదమయంగా మారిపోతుంది. రోగులు వైద్యశాలలోకి వెళ్లేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కాలంలో 100 పడకల వైద్యశాలగా తీర్చిదిద్దారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వైద్యశాల గురించి పట్టించుకోకపోవడంతో ఆ ప్రాంగణం అంతా అస్తవ్యస్తంగా మారింది. వైద్యశాలకు కాంపౌండ్ వాల్ లేక పోవడంతో పశువులు, పందులు వైద్యశాలలోకి జొరబడుతున్నాయని పలువురు రోగులు తెలిపారు. అనునిత్యం దాదాపు 350 మంది రోగులు వైద్య పరీక్షల కోసం ఈ వైద్యశాలకు వస్తుంటారు. వివిధ విభాగాలకు చెందిన స్పెషలిస్ట్ డాక్టర్లతో పాటు 27 మంది వైద్యులు ఉండటంతో ప్రభుత్వ వైద్యశాలకు మంచి ప్రాధాన్యం లభించింది. అటువంటి వైద్యశాలను ప్రభుత్వ పట్టించుకోకపోవడం విచారకరమని పలువురు తెలిపారు. ఈ నెల 10వ తేదీన కలెక్టర్ తమీమ్ అన్సారియా వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సమయంలో వైద్యశాల ప్రాంగణం గురించి వైద్యులు వివరించారు. ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చినప్పటికీ ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. వెంటనే వైద్యశాల ప్రాంగణాన్ని లెవలింగ్ చేసి రోగుల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలని ఈ ప్రాంతం ప్రజలు కోరుతున్నారు.


పెద్దారవీడు: వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథపాలకుడు వెంకటేశ్వరరెడ్డి

ఆదికవి వాల్మీకికి నివాళులు

యర్రగొండపాలెం: వాల్మీకి భారతీయ ఇతిహాస సాహిత్యంలో అత్యంత ప్రముఖమైన ప్రాచీన కవి అని గ్రంథపాలకురాలు కె.రుహాన్సీ అన్నారు. గురువారం ఆదికవి వాల్మీకి జయంతి సందర్భంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం ప్రపంచంలోనే అత్యంత ప్రసిద్ధమైన కావ్యమన్నారు.

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు శాఖా గ్రంథాలయంలో రామాయణం రచయిత వాల్మీకి జయంతి సందర్భంగా గ్రంథపాలకులు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి గురువారం నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం ఎంతో ప్రసిద్ధమైందని, శ్రీరాముల వారి చరిత్ర రాసిన ఘనత వాల్మీకిదని కొనియాడారు. కార్యక్రమంలో స్థానికులు దొడ్డా రామిరెడ్డి, బత్తుల ఆవులయ్య, ఆశోక్‌రెడ్డి, వెంకటేశ్వరనాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.


యర్రగొండపాలెం: వాల్మీకికి నివాళులర్పిస్తున్న గ్రంథ పాలకురాలు రుహాన్సీ, విద్యార్థులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి మాట్లాడుతూ యుగాల నుంచి తరాల వరకు తరగని కావ్యమైన రామాయయణ గ్రంథాన్ని రచించిన వాల్మీకి మహర్షి దేశ ప్రజల హృదయాల్లో నిలిచిపోయారన్నారు.

రుణాలు తీసుకుని.. తిరిగి చెల్లించాలి

దొనకొండ: డ్వాక్రా గ్రూపు మహిళలు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను విడతల వారీగా క్రమం తప్పకుండా చెల్లించి తిరిగి రుణాలు పొంది జీవనోపాధి సాగించాలని స్త్రీ శక్తి ఏపీఎం జి.వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఇండ్లచెరువులో గ్రూపు మహిళలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూపు మహిళలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంక్ సిద్ధంగా ఉన్నాయన్నారు. రుణాలు తీసుకుని చిరు వ్యాపారానికి, పాడి పరిశ్రమకు ఉపయోగించుకుని దాని మీద వచ్చే ఆదాయంతో రుణాలు చెల్లించాలన్నారు. గ్రూప్ మహిళలు రుణాలు పొందే ముందు ఐక్యంగా మాట్లాడుకోవాలన్నారు. రికార్డును జాగ్రత్తగా రాసుకోవాలని చెప్పారు. అప్పుడప్పుడూ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని మహిళలకు ఏపీఎం సూచించారు. కెనరా బ్యాంక్ మేనేజర్ జి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.